## మాజీ ఎంపీటీసీకి పరామర్శ

గంగాధర, ఏప్రిల్ 17 : కాసారం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ న్యాతరి శివశంకర్ ప్రమాదంలో చెయ్యి విరుగగా హాస్పిటల్‌లో చికిత్స పొంది ఇంటికి వచ్చాడు. బుధవారం ఆయనను గంగాధర సింగిల్ విండో చైర్మన్ దూలం బాలాగౌడ్ పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ ముక్కెర మల్లేశం, నాయకుడు అట్ల జగన్మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

సైదాపూర్, ఏప్రిల్ 17: ఎలబోతారంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ ఆరోగ్యం బుధవారం తెలిపారు. వీణవంక మండలం జంగంపల్లి గ్రామానికి చెందిన మూడు ట్రాక్టర్లు ఎలాంటి పర్మిషన్ లేకుండా ఇసుకను తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

## గుడుంబా తయారు చేస్తున్న ఇద్దరిపై కేసు

వీణవంక, ఏప్రిల్ 17:మండల కేంద్రంలో గుడుంబా తయారు చేస్తూ పట్టుబడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు. వివరాలు ఇవి.. ఇల్లందకుంట మండలం మల్యాలకు చెందిన సురేశ్, శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామానికి చెందిన అంగిడి సమ్మయ్య ఇద్దరు వీణవంక బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా కనిపించగా పోలీసులు వారిని సోదా చేయగా, వారి వద్ద ఐదున్నర లీటర్ల గుడుంబా దొరికింది. గుడుంబా ప్యాకెట్లతో పాటు వారిద్దరిని పట్టుకొని స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## కొండగట్టు అంజన్నను దర్శించుకున్న న్యాయమూర్తులు

మల్యాల, ఏప్రిల్ 17: కొండగట్టు అంజన్న ఆలయంలో వేములవాడ, సిరిసిల్ల, కరీంనగర్, మంచిర్యాల కోర్టుల న్యాయమూర్తులు జ్యోతి, ప్రవీణ్‌కుమార్, హేమలత, స్వాతి ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు వారికి ఆలయంలో అర్చకులు ఘన స్వాగతం పలికారు.

## బావిలో దూకి వివాహిత ఆత్మహత్య

వెల్గటూర్, ఏప్రిల్ 17: కిషన్‌రావుపేట గ్రామానికి చెందిన బండారి సత్తవ్వ (38) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నది. దవాఖానల్లో చికిత్స పొందినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురై బుధవారం ఇంటి వెనుకాల ఉన్న వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. సత్తవ్వ భర్త మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ ఉమాసాగర్ తెలిపారు.

# ‘వాల్టా’పై సర్కారు నిర్లక్ష్యం

**ఎండలు మండుతుండడం, భూగర్భ జలాలు అడుగంటడంతో జిల్లాలో నీటి ఎద్దడి తీవ్రస్థాయికి చేరింది. వాణిజ్యపరమైన అవసరాల పేరిట కొందరు నీటిని దుర్వినియోగం చేస్తుండడంతో వేసవి ఆరంభంలోనే కరువు కరాళ నృత్యం చేస్తున్నది. వాల్టా చట్టాన్ని కఠినంగా అమలు చేయాల్సిన సర్కారు చోద్యం చూస్తున్నది. భూగర్భ జలాల పరిరక్షణ, నీటి దుర్వినియోగాన్ని అరికట్టేందుకు కమిటీలు వేసి చేతులు దులుపుకొన్నది. ఈ పరిస్థితుల్లో గుక్కెడు నీటి కోసం అల్లాడుతున్న జిల్లా ప్రజానీకం ప్రభుత్వ నిర్లక్ష్యంపై భగ్గుమంటున్నది.**

*- కలెక్టరేట్, ఏప్రిల్ 17*

- అనుమతుల్లేకుండా విచ్చలవిడిగా నీటి వినియోగం
- వాణిజ్యావసరాల పేరిట దుర్వినియోగం
- అడుగంటిపోతున్న భూగర్భ జలాలు
- పట్టించుకోని పరిరక్షణ కమిటీలు



ఎండకాలం ఆరంభంలోనే ఉమ్మడి జిల్లాపై కరువు ఛాయలు కమ్ముకున్నాయి. సాగునీటి సంగతి దేవుడెరుగు కనీసం తాగు నీరు సైతం దొరకని దుస్థితి. ఈ పరిస్థితుల్లో భూగర్భ జలాల పరిరక్షణకు ప్రభుత్వం వాల్టా (వాటర్, ల్యాండ్ అండ్ ట్రీస్) చట్టాన్ని కఠినంగా అమలు చేసేందుకు అదనపు కలెక్టర్‌తో పాటు మండలాల పరిధిలో తహసీల్దార్లు, సబ్‌డివిజనల్ పోలీసు అధికారులు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, జిల్లా స్థాయిలో జిల్లా గ్రామీణాభివృద్ధి , భూగర్భ జలవనరుల శాఖాధికారులతో కమిటీలు ఏర్పాటు చేశారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా బోర్లు వేస్తూ ఇష్టారాజ్యంగా నీటిని ఇతర అవసరాలకు తరలిస్తున్నా ఈ కమిటీలు పట్టించుకోవడంలేదు. అత్యవసర సర్వీసులందించే గృహ, వ్యవసాయ, కేంద్ర పోలీసు, రక్షణ, నీటిపారుదల శాఖలు మినహా అన్ని విభాగాలు విధిగా అనుమతులు తీసుకోవాలనే నిబంధనలను అమలు చేయడంలేదు. వాల్టా ప్రకారం వాణిజ్య, వ్యవసాయ, ఇంటి అవసరాలకు నిర్దేశించిన లోతులో మాత్రమే బోర్లు వేయాల్సి ఉంటుంది. అయితే ఇందుకు విరుద్ధంగా కొద్ది రోజులుగా విచ్చలవిడిగా బోర్లు వేస్తున్నారు. దీనిపై ఇబ్బడిముబ్బడిగా ఫిర్యాదులు రావడంతో జిల్లా అథారిటీ ద్వారా నామినేట్ చేసిన ప్రత్యేక విజిలెన్స్ బృందం నామమాత్రంగా తనిఖీలు నిర్వహిస్తోంది. ప్రధానంగా కార్పొరేట్ విద్యాసంస్థలు, సినిమా థియేటర్లు, హోటళ్లు, ఫంక్షన్‌హాళ్లు, పరిశ్రమలు, వాణిజ్యం, బల్క్ నీటి సరఫరా, అపార్ట్‌మెంట్లు, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ యూనిట్లపై నిఘా ఉంచి, ఎప్పటికప్పుడూ తనిఖీలు చేయాల్సి ఉంటుంది. నిర్దేశించిన మేరకు నీటి వినియోగాన్ని తెలుసుకునేందుకు డిజిటల్ ఫ్లో మీటర్లు కూడా ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలి. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఉత్తర్వుల మేరకు ప్రతి నెలా ఆయా సంస్థలు వినియోగించే నీటి వివరాలు కూడా సేకరించాలి. అయితే, ఇవేమి పట్టించుకోక పోవడంతో జిల్లా వ్యాప్తంగా ప్రతి రోజు కోట్లాది లీటర్ల నీటి దుర్వినియోగం జరుగుతున్నదని స్వచ్ఛంద నీటి పొదుపు సంఘాలు పేర్కొంటున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి నిర్వీర్యమవుతున్న వాల్టా చట్టాన్ని పటిష్టం చేయాల్సిన అవసరముందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు..

నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా భూగర్భంలో నుంచి నీటిని తోడితే కఠిన చర్యలు తప్పవు. వాల్టా చట్ట ప్రకారం వారిపై కేసులు నమోదు చేస్తాం. అక్రమంగా నీటిని తోడుతున్నట్లు తమ దృష్టికి తెస్తే పరిశీలించి, బాధ్యులపై కఠినంగా వ్యవహరిస్తాం. వ్యాపార, వాణిజ్యావసరాల కోసం నీటిని వాడేవారు తప్పకుండా అనుమతులు తీసుకోవాలి.

*- శైలశ్రీ మల్లికాదేవి, భూగర్భ జలవనరుల శాఖ డిప్యూటీ డైరెక్టర్*



వెలిచాలలో సాయికిరణ్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

# సివిల్స్ ర్యాంకర్‌కు సన్మానం

రామడుగు(చొప్పదండి)/కొత్తపల్లి, ఏప్రిల్ 17: రామడుగు మండలం వెలిచాల గ్రామానికి చెందిన నందల సాయికిరణ్ మొదటి ప్రయత్నంలోనే యూపీఎస్సీ ఫలితాల్లో ఆల్ ఇండియా 27వ ర్యాంకు సాధించగా, బుధవారం మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ వారి ఇంటికి వెళ్లి స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుంకె రవిశంకర్ మాట్లాడుతూ, ప్రణాళికాబద్ధంగా కష్టపడితే అందని విజయం అంటూ ఉండదని, విద్యార్థులందరూ సాయికిరణ్‌ను ఆదర్శంగా తీసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అలాగే నందల సాయికిరణ్‌కు పద్మశాలీ కులస్తులు బుధవారం ఆత్మీయ సత్కారం నిర్వహించారు. వెలిచాలలోని ఆయన నివాసానికి వెళ్లిన కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, పద్మశాలీలు సాయికిరణ్‌తో పాటు కుటుంబ సభ్యులను శాలువాలతో సత్కరించారు. జిల్లాకు చెందిన సాయికిరణ్ సివిల్ ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంకు సాధించడం గర్వంగా ఉందన్నారు.

## ఆర్థిక సాయం అందజేత

గంగాధర, ఏప్రిల్ 17 : మల్లాపూర్ గ్రామానికి చెందిన పుల్కం రాజశేఖర్ అనారోగ్యంతో కరీంనగర్‌లోని ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండగా, అతడిని బుధవారం నాయకుడు తూడి లచ్చయ్య పరామర్శించారు. చికిత్స కోసం రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. లచ్చయ్యకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ తూడి లచ్చయ్య యువసేన సభ్యులు ఉన్నారు.



రాజశేఖర్‌ను పరామర్శిస్తున్న నాయకుడు తూడి లచ్చయ్య

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, ఏప్రిల్ 17: విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున గురువారం ఉదయం 8నుంచి 11గంటల వరకు తీగలగుట్ట పల్లె, చంద్రపురి కాలనీ, ఆర్టీసీ కాలనీ, రెవెన్యూ కాలనీ, వల్లం పహాడ్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని కరీంనగర్ రూరల్ ఏడీఈ కొలుపుల రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ధర్మపురి, ఏప్రిల్ 17: శాలపల్లిలోని రామాలయం ప్రాంగణంలో బుధవారం మంచిర్యాలకు చెందిన డా.అనంతరెడ్డి క్రిటికల్ కేర్ దవాఖాన ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 300 మందికి వివిధ పరీక్షలు చేసి మందులు అందజేశారు. వైద్యులు లోక్‌సాయినాథ్‌రెడ్డి, సురేశ్‌నాయక్, శ్రీమల్లి పాల్గొన్నారు.

## కాలువ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం

మానకొండూర్ రూరల్, ఏప్రిల్ 17: మండలంలోని ఈదుల గట్టెపల్లి కాకతీయ కాలువ సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు బుధవారం మానకొండూర్ పోలీసులు తెలిపారు. మృతుడు వయస్సు దాదాపు 35 నుంచి 40 ఏళ్ల వరకు ఉంటుందని, చెక్స్ షర్టు, ప్యాంటు ధరించినట్లు చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు మానకొండూర్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని మానకొండూర్ సీఐ రాజ్ కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

గన్నేరువరం, ఏప్రిల్ 17: మైలారం గ్రామ ఎక్స్‌రోడ్‌లో అక్రమంగా తరలిస్తున్న రూ.21,712 విలువ గల మద్యాన్ని బుధవారం పట్టుకున్నట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు. బెజ్జంకి మండలం వడ్లూరు గ్రామానికి చెందిన పల్లె సంతోష్ అక్రమంగా మద్యాన్ని తరలిస్తుండగా పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అనుమతి లేకుండా మద్యాన్ని తరలించినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

# నామినేషన్ల ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

- ఎలాంటి తప్పిదాలు జరుగకుండా ప్రత్యేక దృష్టి సారించాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా అధికారులు

కలెక్టరేట్, ఏప్రిల్ 17 : నేటి నుంచి ప్రారంభమయ్యే నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. నోటిఫికేషన్ విడుదలైన అనంతరం చేపట్టాల్సిన జాగ్రత్తలపై బుధవారం రాత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎన్నికల యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. నామినేషన్ల స్వీకరణ నుంచి పరిశీలన, ఉపసంహరణ వరకు రిటర్నింగ్ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఎలాంటి తప్పిదాలు జరుగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే సమయంలో నిబంధనలు పాటించేలా చూడాలని ఆదేశించారు. అభ్యర్థుల వెంట వచ్చేవారు, వాహనాల సంఖ్యను నిబంధనల మేరకే అనుమతించాలన్నారు. స్టాటిస్టిక్స్ సర్వైవ్‌లెన్స్ టీములు ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సువిధ కింద ప్రచారం, సభలు, సమావేశాలకు వెంటవెంటనే అనుమతులు మంజూరు చేయాలన్నారు. సీ విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును ఉద్యోగులంతా సద్వినియోగం చేసుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సోషల్ మీడియాలో ప్రచారానికి సంబంధించి వచ్చే పోస్టులపై దృష్టి సారించాలని ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్ ముద్రణ సమయంలో సింబల్ అలాట్‌మెంట్ జాగ్రత్తగా జరిగేలా చూడాలని తెలిపారు. ఎలాంటి తప్పిదాలు జరుగకుండా చూడాలని, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, సిరిసిల్ల అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, శిక్షణ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఆర్వో పవన్‌కుమార్, కరీంనగర్, హుజూరాబాద్ ఆర్డీవోలు కే మహేశ్వర్, రమేశ్‌బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ‘వాజుద్దీన్‌కు ఎంఐఎంతో సంబంధం లేదు’

కలెక్టరేట్, ఏప్రిల్ 17 : ఊసరవెల్లి కంటే వేగంగా రంగులు మార్చే వాజుద్దీన్‌కు ఎంఐఎం పార్టీతో ఎలాంటి సంబంధం లేదని, ఆపార్టీ నగర నాయకులు స్పష్టం చేశారు. బుధవారం నగరంలోని ఆపార్టీ కార్యాలయం దారుసలాంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పలు డివిజన్ల అధ్యక్షులు సాజిద్, సలీం, మతిన్ మాట్లాడుతూ, 2020 మున్సిపల్ ఎన్నికల్లోనే ఎంఐఎంకు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరాడని, అనంతరం కొద్దిరోజుల పాటు రాజకీయాలకు దూరమైనట్లు తెలిపారు. ఏపార్టీ అధికారంలో ఉంటే ఆపార్టీ వంత పాడే వాజుద్దీన్ మంత్రి పొన్నంతో పనులు చేయించుకునేందుకే తిరిగి కాంగ్రెస్‌లో చేరాడని విమర్శించారు. ఇతర పార్టీల నుంచి చేరినట్లు చెబితే ఉనికి కోల్పోతాడని ఎంఐఎం పేరు చెప్పుకొంటున్నాడని మండిపడ్డారు. చౌకబారు ప్రకటనలతో వ్యక్తిత్వం దెబ్బతీసుకుంటే తమకు నష్టమేమి లేదని, తమ పార్టీ పేరు చెప్పుకొని కండువాలు మార్చడంతోనే వాజుద్దీన్‌పై విమర్శలు చేస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఎంఐఎం నాయకులు ఖాలిక్, షేక్ బాజ్ ఖాన్, అస్లం, హమీద్, జుబేర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



హుజూరాబాద్ టౌన్: ఏరియా దవాఖానలో ఫైర్ సేఫ్టీ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యులు, ఫైర్ ఉద్యోగులు

మానకొండూర్, ఏప్రిల్ 17: అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని మానకొండూర్ అగ్నిమాపక అధికారి భూదయ్య సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం మండల కేంద్రంలో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అగ్నిమాపక సిబ్బంది ప్రజలకు ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్ మెన్ గోపాల్‌రెడ్డి, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

**అగ్ని ప్రమాదాలపై అవగాహన**

హుజూరాబాద్‌టౌన్, ఏప్రిల్ 17: అగ్ని ప్రమాద వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఏరియా దవాఖాన, పట్టణంలోని పలు ప్రైవేట్ హాస్పిటల్స్ వద్ద అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో రూపొందించిన కరపత్రాలు, వాల్ పోస్టర్లను ఆయా చోట్ల అంటించారు. కార్యక్రమంలో వైద్యులు పీ శ్రీకాంత్‌రెడ్డి, టీ విద్యాసాగర్, ఫైర్ అధికారి సీహెచ్ రాజయ్య, ఐఎఫ్‌లు వెంకటేశ్వర్లు, సురేందర్, డీవోపీలు ఐఆర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఈ ప్రభాకర్, ఎఫ్‌ఎంలు వీ శ్రీనివాస్, జీ అనిల్‌కుమార్, హెచ్‌జీ పీ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి రైలులో సాధారణ బోగీలను ఐదుకు పెంచాలి

- ఐదు సాధారణ బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్
- వెల్దిలో ప్రధానికి కోటి ఉత్తరాల కార్యక్రమం ప్రారంభం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ పరికిపండ్ల అశోక్, తదితరులు

మానకొండూర్ రూరల్, ఏప్రిల్ 17: ప్రతి రైలులో సాధారణ బోగీల సంఖ్యను ఐదుకు పెంచాలని ఐదు సాధారణ బోగీల సాధన సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు చేపట్టిన దేశ వ్యాప్త ఉద్యమంలో భాగంగా సాధన సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ బుధవారం వెల్ది గ్రామంలో ప్రధాన మంత్రికి కోటి ఉత్తరాల కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. జనరల్ బోగీల్లో ప్రయాణించే సామాన్యుల సౌకర్యం కోసం ప్రతి రైలులో ఐదు సాధారణ బోగీలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు ప్రధానమంత్రికి దేశ వ్యాప్తంగా కోటి ఉత్తరాలు రాసే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఒక సామాజిక బాధ్యతగా టు, ది ప్రైమ్ మినిస్టర్, ప్రైమినిస్టర్ ఆఫీస్, 152సౌత్ బ్లాక్, రైసినా హిల్స్, న్యూఢిల్లీ-110011 చిరునామాకు ఉత్తరం రాసి పంపాలని కోరారు. వివరాలకు 9989310141లో సంప్రదించాలని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రముఖులు, సీనియర్ సిటిజన్స్ దాదాపు 200 మంది ఉత్తరాలు రాసి పోస్టు చేశారు. సాధన సమితి కరీంనగర్ జిల్లా కన్వీనర్ వెనగంటి చంద్రమౌళి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుంక సందీప్, బొమ్మిడి రమేశ్, పూలు శ్రీధర్, గాడిపల్లి శ్రీనివాస్, అన్నలదాసు రఘుపతి, సుంక మల్లయ్య, కొండా చంద్రమౌళి, సంతోష్, మహేందర్, సుంక చందు, మెరుగు శ్రీనివాస్, వడ్డే సీతారామయ్య, కొదుమూరి పుల్లయ్య, వీరభద్రయ్య, ప్రమీల, నాగయ్య, రాములు, సీనయ్య, లక్ష్మి, కోటమ్మ తదితరులు ఉన్నారు.

## హనుమాన్ దీక్షాపరుల పాదయాత్ర

కోనరావుపేట, ఏప్రిల్ 17: మండల కేంద్రం నుంచి బుధవారం హనుమాన్ దీక్షాపరులు కొండగట్టుకు పాదయాత్రగా బయలుదేరారు. హనుమాన్ దీక్షాపరులు భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకునేందు కు వెళ్లారు. ఇక్కడ రమణారెడ్డి, కే రాజు, జితేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

**WANTED**

jobs Apply Now!

★KFC Hiring P/F Time Jobs in Hyd. SSC Pass, 18 yrs Abv. M&F. 13k with Food & Accom. PF/ Medical/ Bonus/ Incentive. Ph: 9392526486, 9704449461, 8688442326.
NT-136-All

**WANTED**

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K Ph: 9640258899/9640468899
NT-311829

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

# కమనీయం.. రాములోరి కల్యాణం

- జిల్లా వ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలు
- ఇల్లందకుంటలో స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన కలెక్టర్



రాంనగర్‌లోని రమాసహిత సత్యనారాయణ స్వామివారి ఆలయంలో పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్ దంపతులు





ఇల్లందకుంటలో సీతారాములకు పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



పద్మనాయక కల్యాణ మండపంలో సీతారాముల కల్యాణానికి హాజరైన బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చల్మెడ లక్ష్మీనరసింహారావు

కమాన్‌చౌరస్తా/ ఇల్లందకుంట/ మానకొండూర్/ గంగాధర, ఏప్రిల్ 17: శ్రీరామనవమి పర్వదినాన్ని జిల్లా వ్యాప్తంగా బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. ఊరూరా శ్రీసీతారాముల కల్యాణాన్ని అర్చకులు, వేద పండితులు కనుల పండువగా నిర్వహించారు. నగరంలోని పలు దేవాలయాల్లో నిర్వహించిన సీతారాముల కల్యాణానికి పలువురు కార్పొరేటర్లు హాజరై కల్యాణం తిలకించి, అర్చకుల దీవెనలు అందుకున్నారు. నగరంలోని రాంనగర్ రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో నిర్వహించిన కల్యాణ కార్యక్రమానికి కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ దంపతులు, డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపారాణీ హరిశంకర్ దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. భగత్‌నగర్ హెలీప్యాడ్ మైదానంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో మేయర్ వై సునీల్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మేయర్ వై సునీల్ రావు, అపర్ణ దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు అందజేశారు. ఇక్కడ వివేకానంద విద్యాసంస్థల చైర్మన్ సొగాని కొమురయ్య దంపతులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సప్తగిరి కాలనీ కోదండ రామాలయంలో కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు డీ మాహేశ్, బుచ్చిరెడ్డి, గుగ్గిళ్ల జయశ్రీ, ఆలయ చైర్మన్ కే గౌతమ రావు, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. కమాన్ సమీపంలోని రామేశ్వరాలయంలో కల్యాణం నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అపరభద్రాద్రిగా పేరొందిన ఇల్లందకుంట ఆలయంలో శ్రీసీతారాముల కల్యాణానికి కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు. ప్రభుత్వం తరపున స్వామి వారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కల్యాణాన్ని తిలకించారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దంపతులు వేర్వేరుగా దేవాలయంలో పట్టువస్త్రాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి కల్యాణానికి బీఆర్‌ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ దంపతులు హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ కింద కూర్చొని భక్తులతో కలిసి కల్యాణాన్ని తిలకించారు. భక్తులకు కాటన్, రైస్‌మిల్లర్స్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇక్కడ ఆర్డీవో రమేశ్‌బాబు, ఈవో కందుల సుధాకర్, తహసీల్దార్ రాణి, తదితరులు ఉన్నారు. మానకొండూర్ మండల కేంద్రంలోని శ్రీబాలాంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవానికి బీఆర్‌ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్ దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని సన్మానించారు. గంగాధర మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకల్లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పాల్గొన్నారు. హుజూరాబాద్, , జమ్మికుంట, వీణవంక, సైదాపూర్, శంకరపట్నం, గన్నేరువరం, మానకొండూర్, చొప్పదండి, కరీంనగర్ రూరల్, తిమ్మాపూర్, కొత్తపల్లి మండలాల్లోనూ శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి.



భగత్‌నగర్ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు తీసుకువస్తున్న మేయర్ వై సునీల్ రావు, అపర్ణ దంపతులు



కమాన్ వద్ద గల రామేశ్వరాలయంలో కల్యాణం జరిపిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు



సప్తగిరి కాలనీ కోదండ రామాలయంలో కల్యాణోత్సవానికి హాజరైన అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి



ఇల్లందకుంట ఆలయంలో పట్టు వస్త్రాలను అందిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు